క్లుప్తంగా

వినతిపత్రం అందజేత

సీతానగరం: మండల సమాఖ్య కార్యాలయం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మండల సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీల, వెలుగు ఏపీఎం శ్రీరాములు కోరుతున్నారు. ఇదే విషయమై శనివారం ఎమ్మెల్యే అలజంగి జోగారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు.

పక్కాగా వ్యాధి నిరోధక టీకా నిర్వహణ



రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: వ్యాధి నిరోధక టీకా నిర్వహణను పక్కాగా చేపట్టేందుకు వైద్యారోగ్య శాఖ చర్యలు చేపడుతోందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. స్థానిక పట్టణంలోని 22వ వార్డు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించిన ఆయన ఎంతమంది పిల్లలు, గర్భిణులకు ఇంకా టీకాలు వేయాల్సి ఉందని అడిగి తెలుసుకున్నారు. అలాగే టీకాల రికార్డులు తనిఖీ చేశారు. టీకాల ఆవశ్యకతతో పాటు పిల్లలు, గర్భిణులకు ఆరోగ్య సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పుష్ప, జయగౌడ్, ఏఎన్ఎంలు ఉమామహేశ్వరి, విజయ పాల్గొన్నారు.

7 ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

సీతానగరం: మండలంలోని సువర్ణముఖి నదీతీరాన శివాలయం రేవు వద్ద నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 7 ట్రాక్టర్లను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.నీలకంఠం తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎక్కడి నుంచైనా ఇసుక తరలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

గ్రామీణులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు

పార్వతీపురంటౌన్: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందజేయడం జరుగుతోందని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి బి.జగన్నాథరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి శిబిరంలోనే వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయడం జరుగుతోందన్నారు. రిఫరల్ కేసులను జిల్లా ఆస్పత్రికి పంపిస్తున్నామన్నారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాలిథిన్ సంచులు వినియోగిస్తే చర్యలు

రాజాం: ప్లాస్టిక్ సంచులు వినియోగించేవారిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ హెచ్చరించారు. పట్టణంలోని పలు బేకరీలు, స్వీట్ స్టాల్స్, టీస్టాల్, హోటళ్లలో శనివారం తనిఖీలు చేపట్టారు. ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించినందున వాటిని విక్రయించేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఫార్మా మోడల్‌లో కూరగాయల సాగు

రేగిడి: మండలంలోని ఉంగరాడ యూనిట్ గుళ్లపాడు క్లస్టర్ పరిధిలోని చాటాయవలస గ్రామంలో భవానీ స్వయంశక్తి సంఘం సభ్యులకు ఫార్మా మోడల్‌లో కూరగాయల సాగుపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శనివారం అవగాహన కల్పించారు. ఈ విధానంలో 365 రోజులు ఆకుకూరలు, తీగజాతి మొక్కలు, కూరగాయలు సాగు చేయవచ్చని, తద్వారా నిత్యం ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం ఎల్2 పార్వతమ్మ, గౌరీశ్వరరావు, ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కూనుబిల్లి రమణ, సురేష్, రవి, గోవింద్, అప్పలనాయుడు, సర్పంచ్ కరణం గోవిందరావు, రైతులు పాల్గొన్నారు.

ఈకేవైసీ పూర్తి చేయండి..



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

తెర్లాం: నాలుగో విడత జగనన్న విద్యాదీవెన పథకానికి సంబంధించి విద్యార్థుల ఈకేవైసీని తక్షణమే పూర్తి చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సంక్షేమ పథకాల డిజిటల్ రశీదులపై వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం మంజూరు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులతో డిజిటల్ రశీదులు తక్షణమే పూర్తి చేయించాలని సూచించారు. విద్యార్థుల ఈకేవైసీ త్వరగా పూర్తి చేయడంతో పాటు డిజిటల్ రశీదులను పుస్తకరూపంలో పొందుపరచాలన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో..

అందరికీ ఆరోగ్య భాగ్యం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



బలిజిపేట: మిర్తివలసలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వృద్ధుడికి కళ్లద్దాలు పెడుతున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ ఆరోగ్య భాగ్యం కలుగుతోందని, ప్రతీ గ్రామంలో ఈ కార్యక్రమం పేరిట వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, మెరుగైన వైద్యసేవలు అందజేయడం జరుగుతోందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని మిర్తివలస గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి శనివారం వెళ్లిన ఆయన అక్కడ రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సేవలందించాలని, అందరికీ నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రజారోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, గ్రామీణ ప్రజలకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనన్నారు. గ్రామీణ స్థాయిలోనే వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయడం, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా మంచానపడి ఉన్న రోగులకు కూడా వైద్యసేవలు అందజేయడం, ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మరీ ప్రజలకు వైద్యం అందిస్తుండడం వంటి కార్యక్రమాలు ప్రభుత్వం చేస్తోందన్నారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే చేతులమీదుగా కంటిచూపు సమస్యతో బాధపడుతున్న వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ గురురాజు, ఎంపీడీవో విజయలక్ష్మి, డీటీ రత్నకుమారి, వైద్యాధికారి శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని పెదబోగిల గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం సందర్శించారు. శిబిరానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అలాగే అక్కడి రోగులతో మాట్లాడి, సేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం సాధారణ రోగులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఎంతోమందికి ఉపయోగపడుతోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జి, పార్టీ మండల సీనియర్ నేత బి.శ్రీరాములునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, ఎంపీటీసీ సభ్యుడు బి.కుసుమ, ఎంపీడీవో బి.కృష్ణమహేష్ రెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ శిరీష పాల్గొన్నారు.



సాలూరు: మోసంగిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం వద్ద రోగులకు మందుల కిట్ల పంపిణీ



పార్వతీపురం టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష మందుల కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రతీ కుటుంబానికి ఆరోగ్య భరోసానిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని ఎమ్మార్‌నగరం గ్రామంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించిన ఆయన అక్కడ ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు. ప్రజలకు ప్రభుత్వమే ఉచితంగా రక్తపరీక్షలు చేయడంతో పాటు మందులు అందజేస్తోందని, శస్త్ర చికిత్స అవసరమైన వారిని జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేసి, చికిత్స చేయించడం జరుగుతోందన్నారు. ప్రజల వైద్యానికి ఎంత ఖర్చు అయినా ప్రభుత్వమే భరిస్తోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 7 రకాల వైద్య పరీక్షలు చేయడంతో పాటు 172 రకాల మందులను రోగులకు ఉచితంగా అందజేయడం జరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ బి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: మండలంలోని కొదమ గ్రామ సచివాలయ పరిధిలోని మోసంగి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, పార్టీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు తదితరులు శనివారం సందర్శించి, అక్కడ రోగులకు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలోఎంపీడీవో పార్వతి తదితరులు పాల్గొన్నారు. సాలూరు పట్టణంలోని 10వ సచివాలయం పరిధిలో ఉన్న డబ్బీ వీధి హైస్కూల్ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం శనివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ జయరాం తదితరులు కలిసి, సందర్శించి, అక్కడ రోగులకు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా సిబ్బంది పనిచేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామంలో శనివారం ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. మోకాళ్ల నొప్పులు, రక్తహీనత, దగ్గు, స్త్రీలలో తెల్లబట్ట, భగందరం, జ్వరాలు తదితర వ్యాధులకు ఆయుర్వేదంలో మంచి మందులు ఉన్నాయన్నారు. ఆయుర్వేద వైద్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నవారికి ఆయుర్వేద మందులు ఉచితంగా అందజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ రామశేషు, ఏఎన్ఎం స్వాతి, ఆశావర్కర్ భారతి, లక్ష్మి, యోగా టీచర్ రామకృష్ణ పాల్గొన్నారు.

104 వాహన పార్కింగ్ కోసం వినతి

వంగర: అరసాడ పీహెచ్‌సీకి నూతనంగా మంజూరైన 104 వాహనానికి పార్కింగ్ సదుపాయం కల్పించాలని 104 వాహన ఓఈ ప్రదీప్ కోరారు. ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్.సుస్మిత దయానకు శనివారం వినతిపత్రం అందజేశారు. అరసాడ ప్రాథమిక పాఠశాల గ్రౌండ్‌లో వాహనాన్ని పార్కింగ్ చేసేందుకు అనుమతించేలా మండల విద్యాశాఖాధికారితో చర్చించాలని కోరారు. డీఈఓలు మృత్యుంజయ, రవి, కూర్మారావు ఉన్నారు.

శాంతి,భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్

తెర్లాం: మండలంలోని సుందరాడలో శాంతి,భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్ హెచ్చరించారు. ఎస్సై ఆర్. రమేష్‌తో కలిసి శనివారం ఉదయం ఆయన గ్రామాన్ని సందర్శించారు. ఇటీవల జరిగిన దేవీ విగ్రహం నిమజ్జనం సందర్భంగా రెండు కులాల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వర్గంపై కులదూషణ, మరో వర్గంపై పోక్సో కేసులు నమోదైన సంఘటన తెలిసిందే. ఈ మేరకు గ్రామంలో శాంతి,భద్రతలను పరిరక్షించేందుకు.. ఎటువంటి అల్లర్లు జరగకుండా ఉండేందుకు గ్రామ పెద్దలతో చర్చించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామని.. రెండు కేసులపై దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీలు రాజు, ప్రసాదరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ విజయవంతం చేయాలి

తెర్లాం: ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో చేపట్టిన పనులకు సంబంధించి నిర్వహించనున్న 17వ సామాజిక తనిఖీని విజయవంతం చేయాలని సామాజిక తనిఖీ రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ ఎ.సురేష్ కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అధ్యక్షతన సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన అన్ని రకాల పనులకు సంబంధించి గ్రామాల వారీగా సామాజిక తనిఖీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

పార్టీని మరింత బలోపేతం చేయాలి



పార్టీ నేతలను దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయాలని, ఆ దిశగా పార్టీకి చెందిన ప్రతీ నేత, కార్యకర్త, అభిమాని కృషి చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలోని 30 వార్డుల ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లతో శనివారం సమావేశమైన ఆయన 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. పార్టీని నమ్ముకుని ఉన్న వారికి పార్టీలో సముచిత స్థానంతో గుర్తింపు ఎప్పుడూ ఉంటుందన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను తెలియజేయాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చిన ఏకైక పార్టీగా వైఎస్సార్ సీపీ రికార్డు సృష్టించిందన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, అన్ని వర్గాలు బాగుండాలన్నదే ఆయన తపన అని అన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అందరికీ మేలు జరిగింది కనుకనే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లగలుగుతున్నామన్నారు. రానున్న కాలంలో పార్టీ విస్తృత కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు చురుగ్గా పాల్గొనేలా చూడాలన్నారు. ప్రతిఒక్కరూ సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసే బాధ్యతను తీసుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, ఏఎంసీ చైర్మన్ వానపల్లి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

జలాశయంలో చేపపిల్లల విడుదల

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ వట్టిగెడ్డ జలాశయం, పరజపాడు చెరువులో మత్స్యశాఖ అధికారులు ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చేతులమీదుగా శనివారం చేపపిల్లలను విడిచిపెట్టారు. మత్స్యకార సహకార సంఘాల జీవన భృతికి ఇది ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. వట్టిగెడ్డ జలాశమంలో 88,200, పరజపాడు జగన్నాథ సాగరంలో 58,800 చేపపిల్లలను విడిచిపెట్టినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య తెలిపారు. కార్యక్రమంలో మండల మత్స్యశాఖ అధికారి డి.గోపీకృష్ణ, మత్స్య సంఘాల డైరెక్టర్ మురళి, ప్రెసిడెంట్ డి.లక్ష్మణరావు, వట్టిగెడ్డ మాజీ చైర్మన్ బలగ వెంకటరమణ, మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, జెడ్పీటీసీ శశికళ, నాయకులు మరడాన కిశోర్, తదితరులు పాల్గొన్నారు.



వట్టిగెడ్డ జలాశయంలో చేపపిల్లలను విడిచిపెడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

నిర్మాణాలు వేగవంతం చేయాలి

- ఆర్డీఓ ఎం.లావణ్య

కురుపాం: జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా జరిగేలా చూడాలని ఆర్డీఓ ఎం.లావణ్య అధికారులకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కురుపాం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. నాలుగు మండలాల్లో జగనన్న లేఅవుట్లలో నిర్మాణ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాల పురోగతిపై, ఆర్‌బీకేలు, సచివాలయ భవనాల నిర్మాణంపై ఆరాతీశారు. సకాలంలో నిర్మాణాలు పూర్తిచేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ రమేష్‌కుమార్, హౌసింగ్ డీఈ పి.మోహనరావు, ఏఈలు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ ఎం.లావణ్య

ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలి



ప్రశ్నలు అడిగి, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో సింహాచలం

బలిజిపేట: మంచి విద్యాబోధనతో విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని ఎంఈవో సామల సింహాచలం అన్నారు. మండలంలోని గంగాడ గ్రామ డీపీఈపీ పాఠశాలను శనివారం సందర్శించిన ఆయన పాఠశాల రికార్డులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలను ఆయన గమనించి, విద్యార్థుల విద్యాప్రగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలవాలని, నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలన్నారు. కనీస అభ్యసన సామర్థ్యాలు విద్యార్థులకు వచ్చేలా చూడాలన్నారు. ముఖ్యంగా ఆంగ్లంపై విద్యార్థులు పట్టు సాధించేలా శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రతిరోజూ విద్యార్థులతో ఆంగ్ల పాఠాలు చదివించి, ప్రతీ ఆంగ్ల పదానికి అర్థం తెలియజేయాలన్నారు.

రూ. 19 లక్షలతో జల్ జీవన్ మిషన్ పనులు



ఇంటింటి కుళాయిల ఏర్పాటు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: మండలంలోని వెంకంపేట గ్రామ పంచాయతీలో రూ.19 లక్షల వ్యయంతో జల్ జీవన్ మిషన్ పనులు(ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటు)కు ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించడం, ప్రస్తుతం ఉన్న వాటిని మెరుగుపరచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. త్వరగా పైపులైన్ పనులు పూర్తి చేసి, ప్రతీ ఇంటికి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, వైస్ ఎంపీపీలు ఎస్. జగన్నాథరావు, బి.రవికుమార్, సర్పంచ్ తీళ్ల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా నందెన్న ఉత్సవాలు ప్రారంభం



సాలూరు: సాలూరు పట్టణంలోని వడ్డి వీధిలో నందెన్న విగ్రహ ఊరేగింపు

పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల్లోని ప్రతీ గ్రామంలో నందెన్న ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నందెన్న విగ్రహంతో పాటు పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి, మండపంలో ప్రతిష్ఠించి, పూజలు చేశారు. తిరువీధి సమయంలో చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్.



సీతానగరం: పెదంకలాంలో పూజలందుకున్న నందెన్న, గౌరీదేవి, పార్వతీపరమేశ్వరులు



పాచిపెంట: నందెన్న విగ్రహ ఊరేగింపులో భక్తుల సందడి

నవంబరు 4, 5వ తేదీల్లో..

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం



సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో హేమలత

పార్వతీపురం టౌన్: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నవంబరు 4, 5వ తేదీలతో పాటు, డిసెంబరు 2, 3వ తేదీల్లోనూ నిర్వహించనున్నట్లు ఆర్డీవో, పార్వతీపురం నియోజకవర్గ ఎన్నికల అధికారి కె.హేమలత తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితా విడుదల అనంతరం చేపట్టాల్సిన చర్యలపై స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని బూత్ లెవల్ ఆఫీసర్స్‌కు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టాలని సూచించారు. అక్టోబర్ 27 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు ముసాయిదా ఓటరు జాబితాకు సంబంధించి, అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. డిసెంబరు 26వ తేదీ నాటికి వాటిని పరిష్కరించాలని, 2024 జనవరి 5వ తేదీన ఓటర్ల తుది జాబితా ప్రచురణకు సిద్ధమవుతుందన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జరిగే రోజుల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ స్థాయి అధికారులు ఉండాలన్నారు. బూత్ స్థాయి అధికారుల వద్ద ఫారం–6, ఫారం–7, ఫారం–8 అందుబాటులో ఉంచాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సదుపాయాలు ఉన్నవీ లేనివీ గమనించాలన్నారు.